కమ్మేసిన పొగమంచు..

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం

సామర్లకోట పట్టణ పరిసర ప్రాంతాలను గురువారం పొగ మంచు కమ్మేసింది. ఉదయం 8 గంటల సమయానికీ మంచు తెరలు తొలగిపోలేదు. సూ ర్యుడి జాడ కనిపించలేదు. పెద్దాపురంలోనూ ఇదే పరిస్థితి నెలకుంది. ఉదయం పనులకు వెళ్లే రైతులు, కూలీలు, కూరగాయల విక్రయదారులు అవస్థలు పడ్డారు. రహదారిపై ప్రయాణించే వాహనాలకు లైట్లు వేసినా ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించని పరిస్థితి నెలకుంది.

సామర్లకోటలో పొగమంచులో కన్పించని వాహనాలు, ప్రయాణికులు

ఆశాలపై సర్కారు నిర్బంధం

- విజయవాడ వెళ్లేందుకు ఆశాల తీవ్ర ప్రయత్నం
- ఎక్కడికక్కడ అరెస్టులకు పాల్పడిన పోలీసులు
- నిర్బంధాన్ని నిరసిస్తూ ధర్నాలు
- ఖండించిన సిపిఎం, ప్రజా సంఘాలు

'చలో విజయవాడ'కు కాకినాడ జిల్లా నుంచి బయలుదేరిన ఆశ వర్కర్లపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. రైల్వే స్టేషన్లు, బస్‌స్టేషన్లు, జాతీయ రహదారుల్లో ఎక్కడికక్కడ అరెస్టులు చేసి వేర్వేరు ప్రాంతాలకు తరలించారు. ప్రభుత్వ నిర్బంధాన్ని ఆశ వర్కర్లు తీవ్రంగా ప్రతిఘటించారు. జిల్లాలో సామర్లకోట, పెద్దాపురం, తుని, పిఠాపురం, కాకినాడ, తాళ్ల రేవు పోలీస్ స్టేషన్లు, పలు కళ్యాణ మండపాల్లో ఆశాలను ఉంచి నిర్బంధించారు. అక్రమ అరెస్టులకు నిరసనగా సిఐటియు ఆధ్వర్యంలో ధర్నాలు జరిగాయి.

కాకినాడలో ఆశాల అరెస్టుకు నిరసనగా ఆర్‌డిఒ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లున్న ఆశ వర్కర్లను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ బుధవారం తెల్లవారుజాము నుంచే సచివాలయ పోలీసులు ద్వారా ఆశల ఇళ్లకు వెళ్లి ఆటోలు ద్వారా స్టేషన్లకు తరలించారు. రైల్వే స్టేషన్లలో, బస్ స్టేషన్లలో సొంత వాహనాలు పెట్టుకుని వెళ్తున్న ఆశాలను సైతం నిర్బంధించారు. ఉదయం ఏడు గంటలకు అరెస్టు చేసి రాత్రి 10 గంటల వరకు కళ్యాణ మండపాల్లో, పోలీస్ స్టేషన్లో విజయవాడ వెళ్లే రైళ్లు వెళ్లిపోయేదాకా నిర్బంధించారు. ప్రభుత్వ నిర్బంధాన్ని ప్రశ్నిస్తూ ఆశా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాకినాడ సుందరయ్య భవన్ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు తాళ్లు, వాహనాలు అడ్డుపెట్టి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, ఆశాలకు మధ్య తీవ్ర తోపులాటలు చోటుచేసుకున్నాయి. ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషుబాబ్జీని, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి నొక్క లలిత, యూనియన్ నాయకులు మలకా నాగలక్ష్మి, చెక్కల వేణిలను అరెస్టుచేసి స్థానిక 3టౌన్, 1టౌన్‌కు తరలించారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని కోరుతూ కాకినాడ ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సుమారు 200 మంది ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. దీంతో అరెస్టు చేసిన నాయకత్వాన్ని పోలీసులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి.రాజా, రొంగల ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **పెద్దాపురం** చలో విజయవాడకు వెళ్తున్న ఆశ వర్కర్లను సామర్లకోట రైల్వే స్టేషన్లో అరెస్టు చేశారు. అక్కడ నుంచి వారిని స్థానిక మున్సిపల్ సెంటర్లోని అంబేద్కర్ భవనంలో నిర్బంధించారు. దీంతో కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆశ వర్కర్లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ భవనం ఎదుట ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు డి.క్రాంతి కుమార్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సీత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య యుతంగా నిరసన తెలిపే హక్కును కూడా హరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు లోవకుమారి, రమ ఐమ్మ, రామలక్ష్మి, వెంకటలక్ష్మి, ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చింతల సత్యనారాయణ, పెయింటింగ్ వర్కర్ యూనియన్ నాయకులు గూనూరి వెంకటరమణ, వడ్డి సత్యనారా యణ, మిడ్ డే మీల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు కరక సుబ్బలక్ష్మి, సత్యవతి, సిఐటియు నాయకులు ఎస్.శ్రీని వాస్, ప్రజా నాట్యమండలి నాయకులు దార పురెడ్డి కృష్ణ, కూనిరెడ్డి అప్పన్న తదితరులు పాల్గొ న్నారు. **తాళ్లరేవు** కాకినాడ, తాళ్లరేవు ప్రాంతాలకు చెందిన ఆశ కార్యకర్తలను కాకినాడ రైల్వే స్టేషన్, రామచంద్రపురం బస్టాండులో అరెస్టు చేసి కోరంగి పోలీస్ స్టేషన్‌కు తర లించారు. ఈ సందర్భంగా కోరంగి పోలీస్ స్టేషన్ వద్ద ఆశ వర్కర్లు ఆందోళన చేశారు. వీరికి మద్దతుగా ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు ఆధ్వ ర్యంలో టిడిపి, జనసేన పార్టీ నాయకులు ఆశా వర్కర్లకు మద్దతు తెలిపారు. ప్రజాసంఘాల ఆందోళనతో ఆశ కార్యకర్తలను పోలీసులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డి.వెంకటరమణ, ఎ.బాబురావు, టి.లక్ష్మణరావు, వి.వీరబాబు, పి.రామలక్ష్మి. ఎన్.వినోద్, ఎన్.మూర్తి, చౌదరి పాల్గొ న్నారు. **కోటనందూరు** అక్రమ అరెస్టులను నిరసిస్తూ ఆశా కార్యకర్తలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి నక్కల శ్రీనివాస్, ధనలక్ష్మి, నాగేశ్వరరావు, రమణ, సీతారత్నం, సంతోషి, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలంటూ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న ఆశాలు

సిపిఎం ఖండన

ప్రజాశక్తి - కాకినాడ

తమ సమస్యలు పరిష్కారం కోసం చలో విజయవాడకు వెళ్తున్న ఆశ వర్కర్లను ఆరెస్టు చేయడాన్ని సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ ఒక ప్రకటన లో తీవ్రంగా ఖండించారు. వైద్య, కుటుంబ ఆరోగ్య శాఖ అధికారులు చర్చలకు రావాలని పిలిచి, అనంతరం రాత్రి 7:30 గంటలకు యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ధన లక్ష్మిని అరెస్టు చేయడం, రాష్ట్ర ప్రభుత్వ అప్రజా స్వామిక వైఖరికి అద్దం పడుతోందని ఆయన అన్నారు. పోలీసుల నిర్బంధం నుంచి తప్పించు కుని విజయవాడకు చేరుకున్న వందలాది మంది ఆశా కార్యకర్తలు కాలకృత్యాలు తీర్చుకుంటున్న భవనానికి తాళాలు వేసి బంధిం చడం దారుణ మని, కొంత మంది నాయకులను బుధవారం నుంచే గృహనిర్బంధం చేశారని అన్నారు. ఆశా వర్కర్లు కనీస వేతనం, సెలవులు, మెటర్నటీ లీవులు, రిటైర్మెర్ బెనిఫిట్స్, పనిభారం తగ్గించాలని తదితర కోర్కెలతో గత కొంతకాలంగా ఆందోళన చేస్తున్నారని, ప్రశాంతంగా ధర్నాకు వెళ్తున్న వారిని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్స్ నాయకు లను పిలిచి చర్చించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాజశేఖర్ డిమాండ్ చేశారు.

విజయోత్సవ సభలో కేక్‌ను కట్ చేస్తున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబిరాణి

అంగన్‌వాడీల పోరాటం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - కరప

తమ హక్కుల సాధన కోసం అంగన్‌వాడీలు చేసిన 42 రోజుల పోరాటం కార్మిక లోకానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందని అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబిరాణి అన్నారు. స్థానిక తహశీ ల్దార్ కార్యాలయం వద్ద కాకినాడ రూరల్ సెక్టర్ అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పి.వీరవేణి, వరలక్ష్మి అధ్యక్షతన విజయోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల వెనుక వేరే శక్తులు ఉన్నాయని తప్పుడు ప్రచారం జరుగుతుందని, అయితే అంగన్‌వాడీల వెనుక ఎర్రజెండా, సిఐటియు మాత్రమే ఉందని గుర్తుం చుకోవాలన్నారు. 42 రోజుల అంగన్‌వాడీల పోరా టం అనేక అనుభవాలను తెచ్చిపెట్టిందన్నారు. రాత పూర్వకంగా వేతనాలు పెంచుతామని రాష్ట్ర మంత్రులు, అధికారులు సంతకాలతో హామీ పత్రం తీసుకోవడం ద్వారా విజయం సాధించామని అన్నారు. సిపిఎం జిల్లా కన్వీనర్ మోతా రాజశేఖర్ మాట్లాడుతూ మన ఉద్యమ పోరాటాన్ని మరింతగా బలోపేతం చేసేందుకు రాబోయే రోజుల్లో స్థానిక ప్రజా సమస్యలపై పోరాడి బలాన్ని పెంచుకోవాలని అన్నారు. న్యాయమైన సమస్యల కోసం పోరాటం కొనసాగుతూనే ఉంటుందని జిల్లా అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి ఇ.చంద్రావతి అన్నారు. 42 రోజులు ఉద్యమ పోరాటంలో ఉన్న ఆ రోజులకు వేతనం ఇవ్వడం అనేది గొప్ప విజయం అని ఐద్వా నాయకురాలు సిహెచ్. రమణి అన్నారు. తొలుత ఉద్యమానికి అండగా నిలిచిన పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జి మృతికి నివాళులర్పించారు. అనంతరం విజయోత్సవ కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ నాయకురాలు దైవకుమారి, అచ్చారత్నం, ఎం.భవాని, కాకినాడ ప్రాజెక్ట్ కార్యదర్శి వీరమణి, లక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: వర్మ

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక 15వ వార్డులో అర్హులైన నిరుపేదలను గుర్తించి వారికి ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మున్సి పల్ కమిషనర్ కనకారావుకి వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ పట్ట ణంలోని 15వ వార్డ్ లో ఇటివల ఇచ్చిన జగనన్న ఇళ్ళ పట్టాలు భూములు, ఆస్తులు ఉన్నవారికే ఇవ్వడం జరిగిందన్నారు. అర్హత ఉన్న లబ్దిదారులకు ఇవ్వలేదని వైసిపి నాయకులు నిరుపేదలకు పట్టాలు రాకుండా చేశారన్నారు. స్థానిక వైసిపి నాయకులు టిడిపికి చెందిన సానుభూతిపరులనే పేరుతో అర్హులను పక్కన పెడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డం భాస్కర రావు, పిల్లి చిన్న, కొండేపూడి సూర్యప్రకాష్, దేవరపల్లి రామారావు, కౌన్సిలర్‌లు ఎ.నగేష్, ఆర్.శ్రీను, కోళ్ళ బంగారు బాబు, నల్లా శ్రీను, నధిబాబు, పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న టిడిపి నేత వర్మ

వ్యవసాయ విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వెంకటేశ్వర రైస్ ఇండ స్ట్రీస్‌లో రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల విద్యా ర్థులకు వరి నుంచి తయా రయ్యే బియ్యం, నూక, ఇడ్లీనూక, ఉప్పుడు బియ్యం వంటి ఆహార ఉత్ప త్తుల తయారీపై శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చవాన్ శ్యామ్‌రాజ్‌నాయక్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం శిక్షణ తీరును పరిశీలించారు. ఈ సం దర్భంగా చవాన్ శ్యామ్‌రాజ్‌నాయక్ మాట్లాడుతూ ఈ పరిశ్రమ ద్వారా బియ్యం, బియ్యం నుంచి తయారయ్యే ఆహార ఉత్పత్తులు భారీ స్థాయిలో ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. ఈ ఆహార ఉత్పత్తుల తయారీ ప్రక్రియపై వ్యవసాయ విద్యా ర్థులకు ప్రయోగాత్మకంగా శిక్షణ ఇస్తున్నట్లు చె ప్పారు. పరిశ్రమ యాజమాన్యం ఇంటర్న్ షిప్ ధృవీకరణ పత్రాలను కూడా అంద చేస్తాదన్నారు. వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ బి.శ్రీరామ్ మాట్లాడుతూ రైస్ ప్రాసెసింగ్‌లో ఆధునిక శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తు న్నామన్నారు. ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ సిహెచ్ వి నరసింహారావు మాట్లాడుతూ రైస్ మిల్లు యాజమాన్యం లాభాపేక్షకు పరిమితం కాకుండా వరి పండించే రైతులు ఆర్థిక పురోభివృద్ధి సాధించేలా వ్యవసాయానికి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. డాక్టర్ టి ఉషారాణి, డాక్టర్ కె.విజయ్ కుమార్ విద్యార్థులకు మార్గదర్శికాలను వివరించారు.

రైసు మిల్లులో క్షేత్ర స్థాయి పర్యటనలో వ్యవసాయ విద్యార్థులు

కొనసాగిన జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ ఆందోళన

ప్రజాశక్తి - కాకినాడ

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి కాంట్రాక్ట్ శానిటేషన్ వర్కర్స్(సిఐటియు) చేపట్టిన ఆందోళన 8వ రోజు కొనసా గింది. ఈ సందర్భంగా సిఐటి యు జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ మాట్లాడుతూ కాకినాడ జిల్లాతోపాటు చుట్టు పక్కల జిల్లాల రోగులకు వైద్య సేవలు అందించడంలో జిజి హెచ్ అద్భుతమైన సేవలు అందిస్తుందన్నారు. అయితే ఈ కృషిలో శానిటేషన్ వర్కర్స్ తమవంతు పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్స్ పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిఐటియు అనుబంధ సంఘాలు ఈ పోరాటంలో భాగస్వాములు అవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, యూనియన్ నాయకులు పుష్ప, ఆర్.రమేష్, జె.శేషు, ఎస్.వాసు, చంద్రకళ, కుమారి, అరుణ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాతాశిశు విభాగం నుంచి ఒపి విభాగం వరకూ ర్యాలీ నిర్వహించారు.

జిజిహెచ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న శానిటేషన్ వర్కర్లు

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురు వారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సంకురాత్రి ఫౌండేషన్‌కు చెందిన శ్రీ కిరణ్ నేత్ర వైద్య సంస్థ ఆధ్వర్యంలో విద్యా ర్థులు ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్ల యొక్క ప్రాధన్యతపై విద్యా ర్థులకు అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ మాట్లా డుతూ కంటి చూపు పిల్లల మానసిక శారీరక పెరుగుదల మరియు విద్య ప్రగతిపై ప్రభావం చూపుతుందన్నారు. విద్యార్థి దశలోనే కంటి పరీక్షల ద్వారా భవిష్యత్తులో నేత్ర సమస్యలు, దృష్టిలోపం రాకుండా జాగ్రత్తలు తీసుకునే వీలుంటుందని తెలిపారు. ఈ కార్య క్రమంలో ప్రోగ్రాం మేనేజర్ శివ గణేష్ ,వైద్య సిబ్బంది సరిత, అనిత రమ్య వైద్య సేవలం దించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న కంటి వైద్య సిబ్బంది

4వ రోజుకు పెన్షనర్ల దీక్షలు

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఇపిఎఫ్ కార్యాలయం వద్ద జరుగుతున్న పెన్షనర్ల రిలే నిరహంనాదీక్షలు గురువారం నాటికి 4వ రోజుకు చేరుకున్నాయి. పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సిహెచ్.సత్యనారాయణ రాజు, ఆలిండియా పోస్టల్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తురగా సూర్యారావు గురువారం జరిగిన దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెన్షనర్ల సమస్యల పట్ల చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఉద్యోగులకు 8వ పిఆర్‌సి ప్రకటించకుండా కుంటి సాకులు చెబుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా ఇపిఎఫ్ పెన్షనర్లు అలుపెరగకుండా పోరాటం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. ప్రజల ఓట్లతో గద్దెనెక్కిన పాలకులు కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. వచ్చే పార్లమెంటు అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి, వైసిపిలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, జిల్లా సహాధ్యక్షులు జోగ అప్పారావు, జిల్లా కార్యదర్శి యుఎస్ఎన్.రెడ్డి, పి.రమణ, బి.అశోక్, కె.పట్టాభి రామారావు, ఆర్.నందకిషోర్, ఎం.నాగమణి జి.మంగయమ్మ, కె.అప్పలనరసింహ, సూరిశెట్టి సత్యవతి తదతరులు పాల్గొన్నారు.

దీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సూర్యారావు

గ్రేటర్ కాకినాడగా ప్రకటించాలి

ప్రజాశక్తి - కాకినాడ

గ్రేటర్ కాకినాడగా ప్రకటించడం ద్వారానే జిల్లా కేంద్రం అభివృద్ధి సాధిస్తుందని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఫెన్షనర్స్ ప్యారడైజ్‌గా ఉన్న కాకినాడను ఓడరేవులు, సముద్ర పర్యాటక రంగాల బలాన్ని ఉపయో గించుకుని ఆర్థిక అభివృద్ధి కేంద్రంగా మారుస్తామన్న స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ ఫలితాలు జీరో స్థాయిలోనే నిలిచి పోయాయని అన్నారు. వ్యర్థ జలాల శు ద్ధికేంద్రాన్ని మాటలకు పరిమితం చేయడం ఆక్షేపనీయమన్నారు. ఏడేళ్ల కాలంలో రు.1,050కోట్లను స్మార్ట్ సిటీ పేరుతో వృధా చేశారని అన్నారు. పరిసర గ్రామాలతో గ్రేటర్ కాకినాడగా అప్ గ్రేడ్ చర్యలు చేస్తేనే ప్రగతి సాధ్యమన్నారు. రాజకీయ పార్టీలు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గ్రేటర్ కాకినాడ హామీ అంశాన్ని వారి వారి మ్యానిఫెస్టోలో ప్రకటించాలన్నారు.

అధికారుల పర్యవేక్షణలో ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

హుండీల ద్వారా రూ 6,07,435 ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మరిడమ్మ హుండీల ద్వారా రూ.6,07,435 ఆదాయం సమకూరిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామ్మోహన్‌రావు తెలిపారు. గురువారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఉదయభాను నాయుడు, ఆలయ అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ పర్యవేక్షణలో 180 రోజులకు సంబంధించిన హుండీలను తెరిచి ఆదాయాన్ని లెక్కించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, అవధాని, శంకర్, మహిళా భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

'ఫుడ్' యూనిట్లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ జిల్లాలో స్వయం ఉపాధి కోసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్‌ను ఏర్పాటు చేసే వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎపిఎఫ్‌పిసి ఇడి ఎన్.మల్లిఖార్జునరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్ స్కీమ్ (పిఎంఎఫ్ఎంఇ) పథకం కింద లబ్ధిదారుని వ్యాపారాభివృద్ధికి కావాల్సిన అధునాతన పరికరాల కొనుగోలుకు, వర్కుషెడ్ నిర్మాణానికి అయ్యే వ్యయంలో 10 శాతం మాత్రమే లబ్ధిదారుని పెట్టుబడి, ప్రభుత్వం బ్యాంకు ద్వారా 90 శాతం రుణ సౌకర్యం కల్పిస్తూ, అందులో 35 శాతం సబ్సిడీ (గరిష్టంగా 10 లక్షల వరకు) అందించబడుతుందని ఆయన తెలిపారు. జిల్లాలో రైతులు, మహిళలు, నిరుద్యోగులు, స్వయం సహాయక బృందాలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల దరఖాస్తుదారులు ఎపిఎఫ్‌పిసి జిల్లా హార్టికల్చర్ కార్యాలయంలో తమ ఆధార్, పాన్, కరెంటు బిల్, బ్యాంకు పాసుబుక్ తీసుకుని సంప్రదించాలని, లేదా 9603222037కు వాట్సాప్ చేయాలన్నారు. ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఎంపిడిఒ ప్రేమ్‌సాగర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - రౌతులపూడి

రౌతులపూడి ఎంపిడిఒగా ప్రేమ్ సాగర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఏలేశ్వరం ఎంపిడిఒగా పనిచేస్తూ రౌతులపూడికి బదిలీపై వచ్చారు. ఎంపిడిఒ ప్రేమ్‌సాగర్‌ను పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్టూ'నిజం'



వాళ్లేమో నిధుల కోత, వీళ్లేమో పథకాల్లో కోత... ఎన్నికల్లో ఓటుతో ఊచకోత కోస్తే గానీ... లాభం లేదురా!!!

ఇళ్లు అప్పగిస్తారా.. తాళాలు పగులగొట్టమంటారా..

-అధికారులపై వైసిపి కౌన్సిలర్ మండిపాటు

ప్రజాశక్తి - సామర్లకోట

గత ప్రభుత్వ పాలనలో పూర్తి చేసిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించకపోవడంపై వైసిపి కౌన్సిలర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు ఇళ్లు ఇస్తారా..? లేక తామే తాళాలు బద్దలు కొట్టి లబ్ధిదారులకు ఇవ్వమంటారా? అని మున్సిపల్ అధికారులను నిలదీశారు. గురువారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన కో-ఆప్షన్ సభ్యుని ఎన్నిక కోసం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైసిపి కౌన్సిలర్ నేతల హరిబాబు టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించకపోవడంపై మున్సిపల్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహాలు నిర్మించి ఐదేళ్లు పూర్తి కావడంతో చెదలు పట్టి శిథిలావస్థకు చేరుకుంటున్నాయని, లక్షలాది రూపాయలను అప్పులు చేసి చెల్లించిన లబ్ధిదారులు అనేక ఇబ్బందులకు గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గృహ నిర్మాణం పూర్తియి కళ్లెదుటే కన్పిస్తున్నా లబ్ధిదారులు అద్దె గృహాల్లో నివాసాల్లో వారు ఎందుకు ఉండాలని ప్రశ్నించారు. పెద్దాపురం మున్సిపాలిటీలో ఇప్పటికే లబ్ధిదారులకు గృహాలను అప్పగించారని తెలిపారు. ఇదే పద్ధతి కొనసాగితే తాళాలను పగలగొట్టి లబ్ధిదారులకు తామే ఇస్తామని ఆయన హెచ్చరించారు.

ఏకగ్రీవంగా కో-ఆప్షన్ సభ్యుని ఎన్నిక

మాజీ కౌన్సిలర్ మన్యం చంద్రరావు మున్సిపల్ కో -ఆప్షన్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులుగా ఉన్న దవులూరి సుబ్బా రావు రాజీనామా చేయడంతో ఆ ఖాళీని భర్తీ చేసే ప్రక్రియను బుధవారం నిర్వహించారు. కో -ఆప్షన్ సభ్యుడిగా మన్యం చంద్ర రావు ఒక్కరే దరఖాస్తు చేయడంతో ఆయనను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు కమిషనర్ రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ప్రకటించారు. అనంతరం కో-ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైనట్లు ధృవీకరణ పత్రాన్ని ఆయనకు అందచేశారు. గతంలో వరుసగా 4 దఫాలు కౌన్సిలర్‌గా ప్రజలకు సేవలందించారు. ఈ సందర్భంగా చంద్రరావును చైర్‌పర్సన్‌తోపాటు, కమిషనర్, కౌన్సిలర్లు సత్కరించారు. ఈ సమావేశంలో కమిషనర్ జయ రామారావు, వైస్ చైర్‌పర్సన్ గోకిన సునేత్రదేవి, కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ, పితాని కృష్ణ, పాల్గొన్నారు.

టిడ్కో గృహాలపై అధికారులను నిలదీస్తున్న వైసిపి కౌన్సిలర్ హరిబాబు

మోడీ విధానాలు దేశానికి ప్రమాదకరం

- 16న జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి
- రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు, కార్మిక సంఘాల పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అనుసరిస్తున్న విధానాలు దేశ ప్రజానీకానికి ప్రమాదకరమని పలువురు హెచ్చరించారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమలశెట్టి నాగేశ్వరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ మోర్తా రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెఎస్. శ్రీనివాస్, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు రాజబాబు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి రాజబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు తాళ్లూరి రాజు మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలు రైతుల పాలిట ఉరి తాడులుగా మారుతున్నాయన్నారు. ఐదేళ్ల కాలంలో 3 లక్షల మంది రైతులు దేశవ్యాప్తంగా ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్లు పరిశ్రమల్లో సంపద సృష్టించే కార్మికులను ఏ హక్కులు లేని బానిసలుగా మార్చాయన్నారు. కేంద్ర, రాష్ట్ర సంస్థల్లో 23 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నా దేశంలో యువత ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా మారారని అన్నారు. ప్రతిరోజు దేశంలో మహిళలపై అత్యాచారాలు నిత్యకృత్యాలుగా మారాయని, దళితులను, గిరిజనులను, మైనారిటీలను రెండవ తరగతి పౌరులుగా మార్చేందుకు బిజెపి ఐటి సెల్, మోడీ భజన చేసే మీడియాలో కుట్రలు సాగిస్తున్నాయని అన్నారు. 90 శాతం వ్యవసాయ భూముల్లో కౌలు రైతులు అర్ధ బానిసలుగా పని చేస్తున్నారని, ప్రభుత్వాలు ప్రకటించే రైతు పథకాలు ఏవీ కూడా కౌలు రైతులకు చేరటం లేదని విమర్శించారు. మోడీ తీసుకొచ్చిన జిఎస్‌టి వల్ల ప్రతిరోజు ధరలు పెరుగుతున్నాయని, నిత్య వసరాలు సామాన్యులకు అందుబాటులో లేని కారణంగా పౌష్టికాహారం లోపంచి ఆకలి చావులు పెరిగాయని తెలిపారు. ఎన్నడూ లేనంతగా భారతదేశంలో పేదరి కం పెరిగిందని, వీటిని పరిష్కరించలేక మోడీ రాముడి వెనుకాల దాక్కొంటూ, భావోద్వేగాలను ముందుకు తెస్తున్నారని విమర్శించారు. ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరుగుతున్న గ్రామీణ బంద్‌లో రైతు, కార్మిక, వ్యవసాయ కార్మికులు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి రమణమ్మ, నగర కార్యదర్శి జ్యోతి, ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగాల ఈశ్వరరావు, సిఐటియు వర్కింగ్ కమిటీ సభ్యులు కళ్ళ నాగేశ్వరరావు, సత్యన్నారాయణ, ఎఐఎఫ్‌టియు ఉభయగోదావరి జిల్లాల ప్రధాన కార్యదర్శి అంజిబాబు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి జుత్తుగ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెఎస్ శ్రీనివాస్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ

అంకెల గారడీగా బుగ్గన బడ్జెట్

ప్రజాశక్తి - జగ్గంపేట

రాష్ట్ర ఆర్థిక మంత్రి రాజేంద్రనాథ్ రెడ్డి ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెల గారడీగా ఉందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ విమర్శించారు. మండలంలోని ఇర్రిపాకలో గురువారం ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండంత బడ్జెట్ అంచనా చూపి కేటాయింపులు గోరంత అన్నట్లుగా ఉందన్నారు. రూ.13 వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44 వేల కోట్లకు, రూ.35 వేల కోట్లకు ద్రవ్యలోటును, రూ.60 వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనదేనని ఎద్దేవా చేశారు. ఎన్నికల బాదుడు తప్ప బడ్జెట్లో కొత్త అంశాలు లేవని అన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అప్పు రూ.11.58 లక్షల కోట్లకు చేరిందని అన్నారు. మద్యం బ్రాండ్ల ద్వారా రూ.16000 కోట్లు, కార్పొరేషన్ హామీలు రూ.1,10,603 కోట్లు అని, కార్పొరేషన్ తనకాలు రూ.94,928 కోట్లు అని కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు రూ.95,400 కోట్లు అని అన్నారు. 2019 టిడిపి ప్రభుత్వం తీసుకున్న దానికంటే నాలుగు రెట్లు ఎక్కువ అప్పులు చేసి అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా జగన్ అండ్ కో మార్చిందన్నారు. అంకెల గారడీతో ఎన్నికల్లో లబ్ధి పొందుదామని చూస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో కోర్పు సాయితేజ, కన్నబాబు, అడపా భరత్, ఏలేటి బాబి, జాస్తి వసంత్, ముత్యాల పోలు భద్రరావు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని కాండ్రేగుల గ్రామానికి చెందిన బొదిరెడ్డి సూరిబాబు, నాగిరెడ్డి చెల్లారావు, కంపిరి సత్తిబాబు, అడపా చిన్నోడు, నిమ్మల వెంకట దుర్గ, తోటదుర్గ, తదితర 15 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వీరికి ఆయన టిడిపి కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

నేరాలు - ఘోరాలు

స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని పిడిఎస్ రైస్‌ను విజిలెన్స్ అండ్ సివిల్ సప్లై అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. స్థానిక గోకవరం రోడ్డు వైపు వాహనాల్లో పిడిఎస్ రైస్‌ను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో గురువారం తెల్లవారుజామున విజిలెన్స్ మరియు సివిల్ సప్లై అధికారులు, స్థానిక పోలీసులతో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బావి శెట్టి కనకరాజు అనే వ్యక్తి 54 ప్లాస్టిక్ బస్తాల్లో పిడిఎస్ రైస్‌ను ఒక వాహనంలో తరలిస్తుండగా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే జొన్నాడ గ్రామానికి చెందిన నల్లమశెట్టి లక్ష్మణరావు అనే వ్యక్తి 20 కేజీల పిడిఎస్ బియ్యాన్ని గోనె సంచి నుండి గోకవరం వైపు తరలిస్తుండగా అతనిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరిపై వీరిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎస్ఐ ఎ.నాగార్జునరెడ్డి, సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ జి.ఎం.ఎం.కృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాడుతున్న 8 మంది అరెస్టు

ప్రజాశక్తి-కడియం

మండలంలోని దుళ్ల-మురమండ పుంత రోడ్డులోని ఈదులపుంత జగ్గారావు నర్సరీలో పేకాట శిబిరంపై గురువారం అర్ధరాత్రి దాడి చేసి 8 మందిని అరెస్టు చేశామని కడియం సిఐ బి.తులసీధర్ తెలిపారు. వీరంతా దుళ్ల గ్రామానికి చెందిన వారని తెలిపారు. వారి నుంచి రూ.16,240 నగదు, ఎనిమిది సెల్ ఫోన్లు, నాలుగు బైకులు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. మండలంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించినా, ఉపేక్షించబోమని, అటువంటి వారిపై చట్ట పరమైన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్ఐ నైట్ ఇన్‌ఛార్జ్ సిహెచ్.వెంకటరమణ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

9 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - కడియం

కడియం గ్రామం, ప్రధాన కాలువ గట్టు, దొరయ్య రైస్ మిల్లు ఎదురుగా అక్రమంగా మద్యం అమ్ముతున్న ఒక వ్యక్తిని గురువారం అరెస్టు చేశామని సిఐ బి.తులసీధర్, ఎస్ఐ అప్పాజీ తెలిపారు. అతని నుంచి రూ.1,200 విలువైన 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

సారా కేసులో మహిళకు రిమాండ్

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లులో సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి కోర్టులు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు. చాగల్లు-పసివేదల రోడ్డులో మట్ట మంగ అనే ఆ మహిళ వద్ద ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిడదవోలు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని తెలిపారు. ఆమెను రాజమహేంద్రవరం సెంట్రల్‌జైలుకు తరలించారన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -దేవరపల్లి

యాదవోలు గోపాలపురం రోడ్డులో సబ్ స్టేషన్ రోడ్డు లోపల గల జీడిమామిడి తోటలో యాదవోలు చెందిన చిలకా వెంకటేశ్వరరావు(48) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. క్యారేజీ తీసుకుని వెళ్లి ఎంతకు తిరిగి రాకపోవడంతో మృతుని కుమారుడు సాయిరాం తోటలోకి వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సిఐ కె.రామకృష్ణ, ఎస్ఐ కె.శ్రీహరిరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం, తాళ్లరేవు

యుటిఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్థానిక వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో జరిగిన యుటిఎఫ్ కార్యవర్గ సమావేశంలో పలువురు మాట్లాడుతూ సిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ అమలు చేసిన వారికే ఓటు వేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంఎస్‌సి. మూర్తి, మండల ప్రధాన కార్యదర్శి బి.జాన్ కెనడి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అలాగే తాళ్లరేవు మండలంలో ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్‌ను యుటిఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నీలపల్లిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు బి. నాగమణి మాట్లా డారు. ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన వారం రోజులలో సిపిఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని సిఎం జగన్ నిలబెట్టుకోలేదన్నారు. ఓట్ ఫర్ ఒపిఎస్ నినాదాన్ని ఉద్యోగుల్లోకి తీసుకువెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల యుటిఎఫ్ అధ్యక్షుడు ఎం.తాతారావు, మండల గౌరవధ్యక్షులు గోపి సత్యనారాయణ, నాయకులు మొండి వీరబాబు, ఎం.గంగాధరవర్మ, కాశి కరుణ పాల్గొన్నారు.

తాళ్లరేవులో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

రూ.13.42 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి - కాకినాడ

రూ.13.42 కోట్ల ఖర్చుతో కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలో ప్రతిపాదించిన వివిధ అభి వృద్ధి పనులకు ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి గురువారం శ్రీకారం చుట్టారు. ఆయా అభివృద్ధి పనులకు సంబంధించి ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు చేశారు. కౌడ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, మాజీ మేయర్, వైసిపి నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎఎంసీ ఛైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా కాకినాడ సిటీ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. స్మార్ట్‌సిటీ కాకినాడను అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఇ పి.సత్యకుమారి, డిఇలు, ఎఇలు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ ద్వారంపూడి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - జగ్గంపేట, సామర్లకోట

మండలంలోని శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జగ్గంపేట విద్యుత్ శాఖ ఇఇ రత్నలరావు గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. జగ్గంపేట, కాట్రావులపల్లి, రాజపూడి, ఇర్రిపాక సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవి ఫీడర్‌లో చెట్లు నరికివేత, మరమ్మత్తుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ కు అంత రాయం ఏర్పడనుందని ఆయన తెలిపారు. అలాగే సామర్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంత రాయం కలగ నున్నట్టు విద్యుత్ శాఖ పెద్దాపురం ఇఇ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ తెలిపారు. సామర్లకోట సబ్‌స్టేషన్ నుంచి వెళ్లే 11కెవి లైనులో ఉన్న వ్యవసాయ విద్యుత్ సరఫరాకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ అంతరాయం కలుగు తుందన్నారు.

వైసిపికి అండగా నిలవాలి

ప్రజాశక్తి - కోటనందూరు

రాబోయే ఎన్నికల్లో వైసిపికి అండగా నిలవాలని ఎంపిపి శ్రీనివాస్ కోరారు. మండలంలోని భీమవరపుకోటలో స్థానిక సర్పంచ్ జగటాల వీరబాబు, ఎంపిటిసి సభ్యులు కొత్తపెల్లి మాణిక్యాలరావు ఆధ్వర్యంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి జగన్‌ను సిఎంగా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, కొరుప్రోలు కృష్ణ, ఆర్.జోగిరాజు, సుర్ల రాజు పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎంపిపి

రెవెన్యూ అంశాలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో రెవెన్యూ అంశాలపై క్షేత్రస్థాయి అధికారులు దృష్టి సారించాలని జెసి సి.వి.ప్రవీణ్‌ఆదిత్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయి అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జగనన్న భూ హక్కు, భూ రక్ష, నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం గృహాల రిజిస్ట్రేషన్, అసైన్డ్ భూముల వివరాలు, నిత్యవసర సరుకుల పంపిణీ వంటి ఇతర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ జిల్లాకు వచ్చిన తహశీల్దార్లకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో రెవెన్యూ అంశాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉన్న నేపథ్యంలో నూతనంగా వచ్చిన తహశీల్దార్లు అవగాహనను పెంపొందించుకోవాలన్నారు. భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా చేపట్టిన రీ సర్వే పనులు వేగవంతం చేయాలన్నారు. ఫైనల్ ఆర్ఒఆర్ పనులు పూర్తి చేసి భూ హక్కు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాకినాడ జిల్లాకు 1.17 లక్షల రిజిస్ట్రేషన్లు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో రోజుకు ఎనిమిది వేల రిజిస్ట్రేషన్‌లు జరుగుతుండగా క్షేత్రస్థాయి అధికారులు రోజువారి లక్ష్యం నిర్దేశించుకుని ఈ సంఖ్యను మరింత పెంచాలని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్లు తక్కువగా జరుగుతున్న సామర్లకోట, యు.కొత్తపల్లి, తాళ్లరేవు మండలాల తహశీల్దార్లు ఈ అంశంపై మరింత దృష్టి పెట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవి.ప్రసాద్, పౌర సరఫరాల సంస్థ ఇన్‌ఛార్జ్ డిఎం బాలసరస్వతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెసి

టిడిపిని అధికారంలోకి తేవడమే లక్ష్యం

ప్రజాశక్తి - కరప

రానున్న ఎన్నికల నేపథ్యంలో గ్రామ గ్రామాన తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటకంశెట్టి ప్రభాకర్ అన్నారు. కరప గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. గ్రామంలో నెలకున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపిని గెలిపించుకోవడం అవసరమని అన్నారు. చంద్రబాబు సిఎంగా రావడం ద్వారానే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి గ్యారెంటీ ష్యూరిటీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు దేవు వెంకన్న, నాయకులు వెంకటరత్నం చౌదరి, కోన వెంకటలక్ష్మి, గోవిందు, జి వెంకన్న పాల్గొన్నారు.

భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో టిడిపి నేతలు

ఆశ వర్కర్ల అరెస్టు దారుణం

ప్రజాశక్తి - కాకినాడ

న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలని ప్రజాస్వామ్యయుతంగా చలో విజయవాడకు వెళ్తున్న ఆశ కార్యకర్తలను అరెస్టులు చేయడం దారుణమని పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. కనీస వేతనం, వేతనంతో కూడిన మెటర్నిటీ సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు, సిబ్బందిని పెంచి పని భారం తగ్గించాలన్న విధానపరమైన డిమాండ్స్‌తో శాంతి యుత ఆందోళనకు సిద్ధమైన ఆశావర్కర్ల నిరసనను అడ్డుకునేందుకు ఎక్కడికక్కడ గృహ నిర్బంధాలు, అరెస్టులు చేస్తున్న ప్రభుత్వ వైఖరి సక్రమం కాదని అన్నారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మహిళల నైపుణ్యాభివృద్ధి కేంద్రం

ప్రజాశక్తి - కాకినాడ

రెడ్‌క్రాస్ సంస్థ నిర్వహణలో త్వరలోనే ప్రతాప్‌నగర్‌లోని శిశు, మహిళాభివృద్ధి నైపుణ్య కేంద్రానికి శాశ్వత భవనం సమకూరనుందని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా గురువారం ఆయన నిర్మాణ పనులను పరిశీలించారు. భవన నిర్మాణ పనులను వేగంగా చేపట్టాలని సూచించారు. జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ వైడి.రామారావు మాట్లాడుతూ రూ.1.30 కోట్ల సిఎస్ఆర్ నిధులతో శాశ్వత భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. అదే ప్రాంగణంలో శిశుగృహాన్ని నిర్మించి మహిళా శిశు సంక్షేమ విభాగానికి అప్పగిస్తామని చెప్పారు. ఎన్నో ఏళ్ళ రెడ్‌క్రాస్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నిర్వహిస్తున్నామని, ఇప్పుడు శాశ్వత భవనాన్ని సమకూరుస్తున్నామని వివరించారు. ఈ పర్యటనలో రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపికి దూరంగా ఉంటాం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

వైసిపిలో ఒక వర్గం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటామని ఆ పార్టీ జిల్లా కార్యనిర్వక కార్యదర్శి అలమండ చలమయ్య అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నగర పంచాయతీ అభివృద్ధికి, రహదారుల విస్తరణకు, మాస్టర్ డ్రయిన్ నిర్మాణానికి బాలాజీ సౌక్ సెంటర్లో ఆక్రమణలు తొలగించడం జరిగిందన్నారు. దీంతో దుకాణదారులు కోర్టుకెళ్లి స్టే తెచ్చుకున్నారని, కోర్టు ఆదేశాల కోసం ఎదురుచూస్తుండగా వైసిపికి చెందిన కొంతమంది దుకాణదారులను రెచ్చగొట్టి రాత్రికి రాత్రే దుకాణ నిర్మాణాలు చేపట్టేలా ప్రోత్సహిస్తున్నారన్నారని అన్నారు. ఎంతోకాలంగా వైసిపి విజయానికి కృషి చేస్తున్న తమకు పార్టీలో గుర్తింపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు, తొండారపు రాంబాబు, మసిరపు నాగేశ్వరరావు, సుంకర రాంబాబు ఉన్నారు.

సమర్థవంతంగా రేషన్ సరఫరా

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రభుత్వం చేపట్టిన ఇంటింటికి రేషన్ సరఫరా ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించేలా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ఎంవి.ప్రసాద్‌రావు ఆదేశించారు. గురువారం ఆయన పట్టణ పరిధిలో ఎండియు వాహనాల ద్వారా ఇంటింటికీ సరఫరా జరుగుతున్న రేషన్ సరుకుల పంపిణీని ఎంఎస్ఒ విజయ కుమారితో కలిసి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయంలో ప్రతి రేషన్ కార్డుదారుని కుటుంబానికి సక్రమంగా రేషన్ పంపిణీ జరిగేలా తహశీల్దార్, ఎంఎస్ఒలు పర్యవేక్షించాలని తెలిపారు.

IN THE COURT OF THE IV ADDL. DISTRICT JUDGE AND SESSIONS JUDGE CUM MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL : KAKINADA
M.V.O.P. No. 156/2021
Between:
P. RAMACHANDRA RAJU ...Petitioner
and
P. YEDUKONDALU AND OTHERS ...Respondents
2nd Respondent :
Niru Jogi Padma, W/o. Chanti, D.No. 7-7-16, Water Tank Street, Sattireddy Peta, Peddapuram.
పై నెంబరు కేసులో 2వ రెస్పాండెంట్‌కు శ్రీ కోర్టువారి ద్వారా మీకు ఎన్నిసార్లు సమన్లు పంపించిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీ హాజరు నిమిత్తం **ది. 16-02-2024 సం॥రం తేదీన** వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదాకు మీరు **ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.
(By Court Order)
R. రాజలింగేశ్వరరావు, అడ్వకేట్
డో.నెం. 68-8-15/12, అశోక్ నగర్, కాకినాడ. సెల్: 9885955334

జగన్‌కు అండగా నిలవడం అవసరం

ప్రజాశక్తి - సామర్లకోట

రాష్ట్ర అభివృద్ధి కోసం రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డికి మరోసారి అండగా నిలవడం అవసరమని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని మాధవపట్నంలో 4వ విడత ఆసరా నిధుల పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్ అనేక పథకాలను అమలు చేశారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో పెద్దాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నానని, ప్రజలంతా తనను ఆశీర్వదించాలని కోరారు. ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, ఎఎంసి చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, ఎంపిటిసి సభ్యులు, పాల్గొన్నారు.

ఆసరా చెక్కు పంపిణీలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

ముంపు నివారణకు చర్యలు

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట ముంపు నివారణకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ చౌదరి నేతృత్వంలో అధికారులు స్థానిక వీరమ్మ చెరువు కాలువను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ముంపునకు గల కారణాలను వైసిపి నాయకుడు ఒమ్మి రఘురామ్ అధికారులకు వివరించారు. ఈ పర్యటనలో ఆర్ డబ్ల్యూ ఎస్ జెఇ రాంజీ, పంచాయితీ కార్యదర్శి గణేష్ బాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సింధు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక టిడిపిలో వర్గ విభేదాలు మరోసారి బయటపడ్డాయి. స్థానిక ఆర్ అండ్ బి రహదారిపై ఏలేశ్వరం పట్టణ టిడిపి అధ్యక్షుడు సతివాడ రాజేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ వరుపుల సత్యప్రభ వ్యతిరేకవర్గం గురువారం బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఎంతోకాలంగా పార్టీకి సేవలు అందిస్తున్న తమను కాదని వివిధ పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో పైల అయ్యప్ప, శిడగం కన్నారావు, వాగు రమేష్, రాయుడు చిన్న, ముచ్చి అప్పలరాజు, చింతల పాండవులు పాల్గొన్నారు.

జయహో బిసి సభ విజయవంతం

ప్రజాశక్తి - తాళ్లరేవు

టిడిపి, జనసేన పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన జయహో బిసి సభ విజయవంతం అయ్యిందని టిడిపి బిసి సెల్ మండల అధ్యక్షుడు జుత్తుగ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ జయహో బిసి సభను విజయవంతం చేసిన బిసి నాయకులు, కార్యకర్తలు, టిడిపి, జనసేన పార్టీల అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు జన్మదిన వేడుకలు శుక్రవారం మురమళ్లలో జరుగుతాయని, కావున ఆ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో వాడ్రేవు వీరబాబు, పొన్నమండ రామలక్ష్మి, పిల్లి సత్తిబాబు, కట్ట త్రిమూర్తులు, గంజా సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహనా సదస్సు

సదస్సులో మాట్లాడుతున్న ఉద్యాన వన శాఖ అధికారి సుజాతా

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జె.తిమ్మాపురం గ్రామంలో గురువారం ఉద్యాన శాఖ, పతంజలి ఫుడ్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహనా సదస్సు నిర్వహించారు. మండల ఉద్యాన శాఖ అధికారి ఎన్.సుజాత అధ్యక్షతన మీనవల్లి శ్రీనివాసరావు పామాయిల్ తోటలో జరిగిన ఈ సదస్సులో పతంజలి ఫుడ్స్ పెద్దాపురం మేనేజర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడారు. పామాయిల్ గెలలు కోతకు వచ్చిన సమయాన్ని, గెలల నాణ్యతను గుర్తించి కోత చేపట్టాలన్నారు.

మాస్టర్ ట్రైనర్లతో ఇఆర్ఒ సమావేశం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ సిటీ నియోజకవర్గ ఇఆర్ఒ, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు గురువారం ఎన్నికల నిర్వహణకు సంబం ధించి మాస్టర్ ట్రైనర్లతో సమావేశ మయ్యారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఎన్నికకు ముందు రోజు విధుల్లో ఉండే పిఒ, ఎపిఒలు చేపట్టాల్సిన కార్యకలాపాలు, మాక్‌పోల్ ఎలా నిర్వహించాలి? పోలింగ్ అనంతరం పూరించాల్సిన దరఖాస్తులు, ఇతర అంశాలపై ఇవ్వాల్సిన శిక్షణకు సంబంధించి చర్చించారు. ఈ సమావేశంలో ఎన్నికల ఎఆర్ఒ గుంటూరు శేఖర్, డిప్యూటీ తహశీల్దార్ మురళీకృష్ణ, ట్రైనర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇఆర్ఒ, కమిషనర్ వెంకటరావు

పోలింగ్ స్టేషన్ల సందర్శన

పోలింగ్ స్టేషన్‌లో అవసరమైన అన్ని మౌళిక సదుపాయాలపై ఇఆర్ఒ జె.వెంకటరావు క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. నగరంలోని డైరీఫారం, దుమ్ములపేట, పర్లోపేట, సాంబమూర్తినగర్, రాజాజీవీధి, సంజయ్‌నగర్ ప్రాంతాల్లోని దాదాపు 40 పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. విద్యుత్, మంచినీరు, ఫర్నేచర్, ర్యాంపులతోపాటు ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు.

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE. NARASARAOPET. PALNADU Dist.
OS. NO. 192/2018
BETWEEN:-
అడ్డా రమాదేవి మరియు ఇతరులు ....పిటిషనర్స్
AND
జక్కా వీరాంజమ్మ మరియు ఇతరులు....రెస్పాండెంట్స్.
పై నెంబర్ పిటిషన్ నందు R.11 అయిన కంపెర్ల రమేష్ చంద్ర ఆదిత్యకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున కోర్టు వారి ఉత్తర్వులు మేరకు సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ద్వారా ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. ది.01-03-2024 వ తేదీకి వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా తేదీన ఉదయం 10:30 ని.లకు స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ శ్రీ కోర్టు ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలువుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.
R11) కొంపెర్ల రమేష్ చంద్ర ఆదిత్య, S/o సత్యనారాయణ (లేట్) D.No. 3-144, వేలంపేట్, తురంగి పోస్ట్, కాకినాడ, కాకినాడ జిల్లా.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వులు మేరకు)
వాయిదా ది. 01-03-2024.
ఇట్లు.
పి చక్రపాణి,పిటిషనర్, తరపు న్యాయవాది,
కేబీఆర్ కాంప్లెక్స్, స్టేషన్ రోడ్,
నరసరావుపేట, పల్నాడు జిల్లా,
Cell.No. 9885644203.

దస్తావేజులు పోయినవి
నా క్లయింట్సు అయిన పూర్వం తూర్పుగోదావరిజిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ సిటీ, బ్యాంకుపేట, డోరునెం. 19-4-23రు కాపురస్తులు కోన (లేటు) వెంకటరమణ గారి భార్య 1) కోన అరుణకుమారి, వీరి కుమారుడు 2) కోన ప్రసన్న కుమార్, యీ1వ వారి కుమార్తెలు 3) బడుగు నవ్యకళ 4) అయిత తులసి గార్లు నలుగురు నాకు యిచ్చిన సంజాయిషీ పై యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నాక్లయింట్సులో 1వ వారికి భర్తగారున్నూ, 2, 3, 4 వార్లకు తండ్రిగారున్నూ అయిన కోన (లేటు) వెంకటరమణ గారికి వారి తండ్రి గారైన కోన ఫకీరు గారున్నూ, మరియు వారి సోదరుడైన కోన సుదర్శనరావు గారున్నూ కలిసి వార్ల తాలూకు జాయింటు అనిర్దిష్టం 2/3వ వంతు హక్కు ఆస్తిని కోన (లేటు) వెంకటరమణ గారికి ఒదలుకుంటూ వారి పేరన ది. 03-07-1995వ సం॥రం॥ తేదీని హక్కువిడుదల దస్తావేజును వ్రాయించి కాకినాడ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వపుస్తకం, దస్తావేజునెం. 4189/1995 రుగా రిజిస్ట్రీ కాబడిన హక్కు విడుదల దస్తావేజు ఒరిజినల్సు మరియు సదరు దస్తావేజు లింకు దస్తావేజు నెం.1783/1995రుగా రిజిష్టీ కాబడిన పారీఖత్తు దస్తావేజు డ్యూప్లికేటు కాపీ యొక్క ఒరిజినల్సూ తీసుకుని ది. 28-01-2024వ సం॥రం॥ తేదీని మా క్లయింట్సులో 1వ వారైన కోన అరుణ కుమారి గారు ఇంటి వద్ద నుండి కాకినాడ రామారావుపేట, సుబ్బయ్య హోటల్ దగ్గరలో గల యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్యాంకుకు లోను నిమిత్తము వెళుతుండగా మార్గమధ్యలో పడిపోయినవి. ఎంత వెతికిననూ దొరకలేదు అని మా క్లయింట్సు తెలియజేసినారు. కావున ఎవరికైనా సదరు దస్తావేజులు దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందజేయగలదు.
పిల్లి శేషరావు, అడ్వకేటు
కాకినాడ, సెల్: 9949147926